RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 155 | మే 14, 2025 | వెల : రూ.3-00



పండ్లతోటల పెంపకం కొరకు

**దరఖాస్తుల స్వీకరణ**

4లో..




# ప్రాణాలు కాదు.. పైసలే ముఖ్యం..!

- ‘బంధన్’ ఆస్పత్రి నిర్వాకంపై బాధితుల ఆగ్రహం
- సదరు ప్రైవేటు హాస్పిటల్‌పై చర్యలకు జాప్యమెందుకు?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

తమకు ప్రాణాలు కాదు..కాసులే ముఖ్యం.. ప్రజల ప్రాణాలంటే పట్టింపు అసలు లేదనే రీతిలో హనుమకొండ బంధన్ ఆస్పత్రి వ్యవహార సరళి ఉందని బాధితులు, ప్రజలు వెల్లడిస్తున్నారు. సదరు హాస్పిటల్‌లో అర్హత, అనుభవం లేని డాక్టర్లు వైద్యమందిస్తుండటంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. గతంలో బంధన్ ఆస్పత్రిలో జరిగిన నిర్లక్ష్యంతో ఓ జర్నలిస్టు ప్రాణాపాయ స్థితికి వెళ్లి బయటపడ్డాడు. హాస్పిటల్ వైద్యులు నిర్లక్ష్యంతో చేసిన క్షమించని రాని వైద్యంపై బాధితుడు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు చేసినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఒకవేళ ఆఫీసర్లు అప్పుడే స్పందించి ‘బంధన్’ ఆస్పత్రిపై తగు చర్యలు తీసుకుని ఉండుంటే.. ప్రైవేటు ఆస్పత్రిలో అందే వైద్యం కొంత మేరకైనా మెరుగుదల ఉండేదని, చర్యలకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తుండటంతో ‘బరితెగించి’ మరి కాసుల కక్కుర్తితో ఇష్టారాజ్యంగా బంధన్ ఆస్పత్రిలో వ్యవహారాలున్నాయని బాధితులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలని, మరో ప్రాణం ప్రమాదపు అంచునకు వెళ్లే వరకు చూడొద్దని గ్రేటర్ వరంగల్ నగరవాసులు కోరుతున్నారు.



# భారత్ మాతాకీ జై

- నినాదం శత్రువులకు నిద్ర లేకుండా చేసింది
- మరోసారి ఉగ్రదాడి జరిగితే భారత్ గట్టిగా జవాబు ఇస్తది
- ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారిని వేర్వేరుగా చూడుము
- భారత ప్రధాని నరేంద్ర మోదీ

**వేద న్యూస్, డెస్క్:**

ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారిని వేర్వేరుగా చూడమని అన్నారు. మంగళవారం పంజాబ్ లోని జలంధర్ జిల్లాలో ఉన్న ఆదంపుర్ ఎయిర్‌బేస్‌ను మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆదంపుర్ ఎయిర్‌బేస్‌లో మోహరించిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ ముందు నిలబడి సెల్యూట్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వాయుసేన సిబ్బందితో ముచ్చటించి ఆపరేషన్ సిందూర్ వివరాలను అడిగి తెలుసుకొని వారిని అభినందించారు. వైమానిక దళ సిబ్బందితో కలిసి పెద్దపెట్టున భారత్ మాతాకీ జై, జై జవాన్ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ ఎట్టిపరిస్థితుల్లనూ తలొగ్గదని అన్నారు. త్రివిధదళాలు ఎవరి బాధ్యత వారు అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో మానవశక్తి, యంత్రశక్తి మధ్య అద్భుతమైన సమన్వయంతో పని చేసినట్లు చెప్పారు. భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు మట్టిలో కలిసిపోయాయని అన్నారు. భారత క్షిపణులు, డ్రోన్లు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించాయని, పాక్‌లో ఎక్కడ కూడా ప్రశాంతంగా శ్వాస తీసుకునే అవకాశం లేకుండా చేశామని తెలిపారు. పాక్ సైన్యానికి నిద్రలేని పరిస్థితి సృష్టించామన్నారు. భారత వైమానిక స్థావరాలపై దాడులు చేసేందుకు పాక్ నిరంతరం ప్రయత్నించిందని ఐతే సరిహద్దుల ఆవతలే మన త్రివిధదళాలు ఆ దాడులను తిప్పికొట్టాయని తెలిపారు. భారత సైనికుల ధైర్య సాహసాల కారణంగా ఆపరేషన్ సిందూర్ విజ యం ప్రతిధ్వనులు ప్రపంచవ్యాప్తంగా వినబడుతున్నాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత్ ఆత్మవిశ్వాసానికి కొత్త ప్రమాణాలను లిఖించిందన్నారు. మన ఆడబిడ్డల సిందూరం తుడిచిన ఉగ్రవాదులను వాళ్ళ ఇంట్లోకి దూరి కేవలం 25 నిమిషాల్లో సరిహద్దు ఆవతల ఉగ్ర స్థావరాలను కచ్చితంగా గురిచూసి కొట్టామని తెలిపారు. మన క్షిపణి రక్షణ వ్యవస్థ ముందు పాక్ డ్రోన్లు, క్షిపణులు, విమానాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయన్నారు. మన త్రివిధదళాలు చూపిన సామర్థ్యం ప్రపంచాన్ని నివ్వెరపరిచిందని తెలిపారు. మళ్లీ ఉగ్రదాడి జరిగితే భారత్ ఇచ్చే సమాధానం ఎలా ఉంటుందో పాక్‌కు అర్థమైందని తెలిపారు. భారత్ మాతా కీ జై అనేది కేవలం నినాదం కాదని, దేశం కోసం తమ ప్రాణాలను అంకితం చేస్తామని మన సైనికులు చేసే ప్రతిజ్ఞ అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారత్ మాతా కీ జై అనే నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని అన్నారు.



# సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీఐ కమిషనర్లు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

రాష్ట్ర సమాచార కమిషన్ (ఆర్టీఐ)కు కొత్తగా నియమితులైన కమిషనర్లు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్ లు తమ కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిషనర్లుగా తమను నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. లోగా వారు మూడేళ్ల పాటు లేదా 65 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఆ పదవిలో ఉండనున్నారు.

# డీసిల్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



డీసిల్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా పరిధిలోని 14, 22 డివిజన్ పరిధిలో మేయర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి శానిటేషన్ డీసిల్టింగ్ పనుల పురోగతిని పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోచమ్మ జంక్షన్లో పర్యటించిన మేయర్ అధికారులకు సూచనలు చేస్తూ జంక్షన్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. డ్రైన్‌ల మీద డబ్బాలు ఉన్నాయని వెంటనే వాటిని తొలగించి సిల్ట్ తొలగించాలని అన్నారు. కోట చెరువు యూటి వద్ద కొనసాగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కావేటి కవిత, బస్వరాజు కుమారస్వామి, ఏంహెచ్‌ఓ డా.రాజేష్, ఏసిపి శ్రీనివాస్ రెడ్డి, డిఈలు రంగారావు, కృష్ణమూర్తి, టిపిఎస్ అనిల్ పాల్గొన్నారు.

# చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలి

**వేదన్యూస్, హైదరాబాద్**



పార్టీ మార్పుపై వచ్చే ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ నాయకత్వంపై అనేక సార్లు నా అభిప్రాయాన్ని చెప్పానని, మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని

మిగతా 4వ పేజీలో..







# సీజేఐగా పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా

- సుప్రీంకోర్టు 51వ చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన ఖన్నా
- నేడు 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్ ప్రమాణస్వీకారం

**వేద న్యూస్, డెస్క్:**

భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా మంగళవారం పదవీ విరమణ చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ నేపథ్యంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆయనకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. సీజేఐగా ఖన్నా పనితీరును బార్ సీనియర్ లాయర్లు ప్రశంసించారు. ఈ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా మీడియాతో

మిగతా 4వ పేజీలో..

# ప్రతి ఫోటోగ్రాఫర్ ‘కుటుంబ భరోసా పథకం’లో చేరాలి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుండి ఫోటోగ్రఫీ కుటుంబ భరోసా పథకం ద్వారా పదివేల రూపాయల చెక్కులను మంగళవారం నల్గొండ పట్టణ ఫోటోగ్రాఫర్స్ భవనంలో అందించడం జరిగింది. ముందుగా సోమవారం ఆకస్మిక మరణం చెందిన నల్గొండ పట్టణ ఆల్బమ్ డిజైనర్ గోరంట్ల శివకుమార్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లగొండ, మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ సభ్యులు, నల్లగొండ కమిటీ సభ్యుల అనారోగ్య సమస్యల గురించి తెలియజేయగానే స్పందించి, ఫోటోగ్రఫీ కుటుంబం భరోసా పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ 10 వేల రూపాయల చెక్కును,మొత్తంగా జిల్లాలో 4 గురు సభ్యులకు 40 వేల రూపాయల చెక్కులు అందించినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ ఈ పథకంతో పాటు 100 రూపాయల



పథకంలో కూడా సభ్యులుగా చేరాలి అని,మన కుటుంబాలకు మన తర్వాత భరోసా కల్పించే ఏకైక పథకం ఇదే అని తెలుపుతూ అందరూ కూడా దీనిలో భాగస్వామ్యం అవ్వాలి అని కోరారు.

రాష్ట్ర కోశాధికారి భీమిడి మాధవ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్,రాష్ట్ర అసోసియేషన్ లో శాశ్వత సభ్యత్వం ఈనెల 20వ తారీకు లోపు తీసుకోగలరని మనవి చేశారు.రాష్ట్ర ఫోటోగ్రఫీ కుటుంబ భరోసా ఇంచార్జ్ బొలుగూరి నాగరాజు మాట్లాడుతూ పట్టణ, మండల అసోసియేషన్‌లో శాశ్వత సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్క సభ్యుడు ఫోటోగ్రఫీ కుటుంబ భరోసాలో తప్పక చేరాలని, అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు మన కుటుంబ సభ్యులకు ఫోటోగ్రఫీ కుటుంబ భరోసా ద్వారా లబ్ధి పొందేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి భీమిడి మాధవ రెడ్డి,రాష్ట్ర ఫోటోగ్రఫీ కుటుంబ భరోసా ఇంచార్జ్ బొలుగూరి నాగరాజు,రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం రూపేందర్,రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సామల వెంకటేశ్వర్లు,నల్లగొండ జిల్లా అధ్యక్షులు పసుపులేటి క్రిష్ణ ,కార్యదర్శి పుట్ట మోహన్ రెడ్డి ,జిల్లా కుటుంబ భరోసా ఇంచార్జ్ నక్క జానయ్య, నల్లగొండ పట్టణ అధ్యక్షులు కంభంపాటి రవి, ప్రధాన కార్యదర్శి దాసపత్రి జనార్ధన్, పట్టణ గౌరవ సలహాదారులు సామన బోయిన రాము, మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు గంధం నాగరాజు,ప్రధాన కార్యదర్శి పందిరి లక్ష్మణ్, గౌరవ సలహాదారులు గుగులోతు పాండు, సీనియర్ ఫోటోగ్రాఫర్ కొత్తపల్లి సైదులు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం, మే 14, 2025

# నిప్పుల కొలిమి

- ఎండవేడికి ఉడుకుతున్న జనం
- జిల్లాలో 43 కి చేరిన ఉష్ణోగ్రత..!
- ఇండ్లకే పరిమితమవుతున్న జనం
- వేడెక్కుతున్న ఏసీలు, కూలర్లు
- జిల్లాలో రోడ్లన్నీ నిర్మానుష్యం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



రెండు మూడు రోజుల నుంచి ఎండ వేడిమి కి జిల్లా నిప్పుల కొలిమిగా మారింది. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ భగ భగ మండుతూ ఇప్పటికే జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరింది. దీంతో ప్రజలు అతలాకుతలమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు దంచికొడుతున్నాయి. జనం ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఉదయం 9 గంటల నుండి ఎండలు దంచి కొట్టడంతో ఇంటి నుండి వెళ్లాలంటే భయపడుతున్నారు. ఎండ తీవ్రతకు పిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరం తప్ప బయటకు వెళ్లాలంటే సాయంత్రం పూట వారి పనులను చేసుకుంటున్నారు.అదేవిధంగా జిల్లాలో ఉపాధి హామీ కూలీలు 8 గంటలకే పనులకు వెళ్తున్నారు. ఉపాధి కూలీలకు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేక అల్లాడుతున్నారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీలను పట్టించుకునే నాధుడే కరువయ్యారు. కూలీలకు కనీసం రోజువారీగా 309 చెల్లించాల్సిన నియమ నిబంధనలు ఎక్కడ అమలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా మూగజీవాలు నీటి కోసం నీటి తొట్లు లేక అల్లాడుతున్నాయి. జిల్లాలో మూగజీవాల కోసం నీటితోట్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ఎండ తీవ్రతకు కొన్ని ప్రాంతాల్లో రోడ్లన్నీ నిర్మాణస్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రతకు జిల్లాలోని కొన్ని పట్టణాల్లో షాపులు వెలవెలబోతున్నాయి. ఇది గాక ఇండ్లలో గాబుల్లో, డ్రమ్ములలో ఉన్న నీటి కూడా వేడెక్కిపోతున్నాయి. దీంతో మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏసీలు, కూలర్లు ఎండ తీవ్రతకు వేడిస్తుండడంతో జనం నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఇంటికే పరిమితమవుతున్నారు. ఉద్యోగులు 8 గంటలకే తమ కార్యాలయాలకు వెళుతున్నారు. అంతేకాదు రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు నీటి దహార్తి కోసం అల్లాడుతున్నారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో పట్టణాల్లోకి వెళితే నీటి బాటిల్స్ లో నీటిని నింపుకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో వాహనదారులు, ప్రజలకు ప్రధాన కూడల్లో చలివేంద్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాల్లో గ్రామాలలో చలివేంద్రాలు స్వచ్ఛంద సంస్థల ద్వారానైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు, పాదాచారులు కోరుతున్నారు. ఎండ తీవ్రకు తట్టుకోలేక జనం టోపీలు, కళ్ళజోళ్ళు వాడే పరిస్థితి ఏర్పడింది. మహిళలైతే స్కార్ఫులు, హెల్మెట్లు ధరిస్తూ ఎండ నుండి రక్షణ పొందుతున్నారు. ఇది గాక ఎండ నుండి రక్షణ పొందేందుకు శీతల పానీయాలు, పండ్ల రసాలు,మజ్జిగ ఇతర పానీయాలు ఎక్కువ తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. చిన్నా మధ్యతరగతి కుటుంబాలు కూలర్లు ఉపయోగించడంతో వేడికి తట్టుకోలేక పోతున్నారు. మే మాసం జొరబడడంతో ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## రాజీవ్ యువ వికాసంతో వికసించనున్న యువత భవిత

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపనుందని తెలంగాణ స్టేట్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పది సంవత్సరాలు ఈ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు “రాజీవ్ యువ వికాసం” పథకం కింద నాలుగు లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ చిన్న మధ్య తరహా పరిశ్రమలు 300కు పైగా వివిధ రకాల స్కీములు ఈ పథకంలో చేరుస్తూ ఉపాధి చూపిస్తుందని అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో ఆయిల్ ఫామ్, పంపుసెట్, పౌల్ట్రీ ఫామ్, ఆవులు గేదెలు, వేరుసెనగ మిషన్, ఎద్దుల బండ్లు, ఆటోమొబైల్,బేకరీ షాపులు, గాజుల షాపులు, తో పాటు గొర్రెల పెంపకం, హెయిర్ కటింగ్,బట్టల తయారీ, జనరల్ స్టోర్,వడ్రంగి షాప్, ఎలక్ట్రిషన్, లాండ్రీ షాప్, తదితర అన్ని రంగాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం తమ కాళ్ళ మీద తాము నిలబడే విధంగా జీవించాలని ఉద్యోగం కంటే సొంతంగా ఉద్యోగం సంపాదించుకోవడం ముఖ్యమని ఆయన అన్నారు. ఉద్యోగాలు లేక ఉపాధి లేక లక్షలాదిమంది నిరుద్యోగ యువకులు వీధిన పడుతున్న సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంచి బృహత్తరమైన ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం ఈ రాష్ట్ర నిరుద్యోగ యువతీ యువకులకు వరప్రసాదంగా మారిందని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. అంతేకాదు నిరుద్యోగ యువతీ యువకులకు మంచి అవకాశాలు కల్పించాలని సంకల్పంతో 2023 మార్చి 15న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ‘రాజీవ్ యువ వికాసం” పథకాన్ని ప్రారంభోత్సవం చేశారని ఈ పథకం ద్వారా రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది యువకులకు మొదటి విడతలో నాలుగు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసిందని ఈ పథకం జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు నిరుద్యోగలబ్ధిదారుల ఎంపిక పత్రాలు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రాజీవ్ యువ వికాసం పథకం కోసం ప్రభుత్వం బడ్జెట్లో 6000 కోట్లు రూపాయల నిధులను కేటాయించిందని ఈ పథకం పారదర్శకంగా అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిరుద్యోగులైన యువతి యువకులకు చేయూతను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రతి లబ్ధిదారుడికి యువతీ యువకులకు 60 నుండి 90 శాతం వరకు సబ్సిడీ మిగతాది బ్యాంకు రుణంగా ఉంటుందని ఆయన వివరించారు. ఈ పథకంలో పలు రకాల రంగాలలో వివిధ రకాల యూనిట్ల ను నెలకొల్పేందుకు ప్రభుత్వం పొందుపరిచిందని తొందరలోనే ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. వ్యవసాయ వ్యవసాయ యయంత్ర రంగాలతో కలిసి కొత్తగా యూనిట్లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుద్యోగ యువకులకు ఇబ్బంది కలిగిస్తున్న సిబిల్ స్కోర్ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ తక్కువ ఆదాయం కలిగిన అభ్యర్థులపై భారం పడకుండా బ్యాంకులు వసూలు చేసే ఫీజులు మినహాయింపు ఇవ్వాలని ప్రతి పాదన ప్రభుత్వం పరిశీలిస్తుందని సిబిల్ స్కోర్ వల్ల నిరుద్యోగులు ఈ పథకంలో రుణాలు పొందలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఒక మంచి సంకల్పంతో స్టేట్ లెవెల్ బ్యాంకర్ల సమావేశంలో చర్చించి ఈ సమస్యను కూడా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక పరిపుష్టి అభివృద్ధి సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఏ పథకం కూడా నిలిచిపోకుండా అమలు చేసేందుకు ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని ఆయన అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు ఉన్నది ఉన్నట్లు ఆర్థిక పరిస్థితి వస్తున్న ఆదాయము ఖర్చులు అప్పుల వివరాలు వెల్లడించిన ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారని ఆయన అన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గత పాలకులు ప్రజలకు చెప్పకుండా దగా చేశారని లోలోపల అప్పులు చేసి కుప్పలు చేశారని ఆరోపించారు. కానీ ఈ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని అందువల్ల ప్రజలకు ప్రతి విషయం తెలియజేసి ప్రభుత్వం పాలిస్తుందని ఈ విషయం ప్రజలు గమనించి ప్రభుత్వానికి సహకరించాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా రాంపల్లి రాంబాబు

**వేద న్యూస్, కోదాడ :**



తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే పి కుమార్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడిగా కోదాడ నియోజకవర్గ ఇన్చార్జిగా మండలం లోని రామాపురం గ్రామానికి చెందిన రాంపల్లి రాంబాబుని నియమించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కే పి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి ఉపేందర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన రాంబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని ప్రైవేట్ టీచర్లందరికీ పిఎఫ్ సదుపాయం ఏర్పాటు చేయాలని అర్హతులైన ప్రైవేట్ టీచర్లందరికీ ప్రభుత్వం పథకాలు అందేలా చూడాలని 10 శాతం ఇందిరమ్మ ఇండ్లను ప్రైవేటు టీచర్లకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాంపల్లి రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రవేట్ ఉపాధ్యాయ సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులుగా కోదాడ నియోజకవర్గ ఇంచార్జ్ గా తనను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు కే పి కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి ఉపేందర్,జిల్లా గౌరవ అధ్యక్షులు బచ్చలకూరి జానయ్య,జిల్లా అధ్యక్షులు పిల్లలమర్రి కలింగం,జిల్లా ఉపాధ్యక్షులు శక్తి రాజశేఖర్ తదితరులు పాల్గొని ప్రవేట్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని త్వరలోనే నియోజకవర్గ మండల కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు.

## భారత్ మా ఎయిర్ బేస్‌లపై తీవ్రంగా దాడి చేసింది

**వేద న్యూస్, డెస్క్:**



భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వం, అక్కడి రాజకీయ నాయకుల నుంచి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వెలువడుతున్నాయి. ఒకవైపు తమకేమీ నష్టం జరగలేదని, విజయం తమదేనని పాక్ ప్రధాని వంటి ఉన్నత స్థాయి నేతలు ప్రకటిస్తుండగా, మరోవైపు క్షేత్రస్థాయి వాస్తవాలు క్రమంగా బయటకు వస్తున్నాయి. తాజాగా, పాకిస్థాన్ ఉప ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఈ అంశంలో కొత్త చర్చకు దారితీశాయి. భారతదేశంతో జరిగిన ఇటీవలి ఘర్షణల నేపథ్యంలో పాకిస్థాన్‌లోని తమ 11 వైమానిక స్థావరాలపై భారత్ పెద్ద ఎత్తున క్షిపణి దాడులు చేసిందని ఆ దేశ ఉప ప్రధాని ఇషాక్ దార్ అంగీకరించారు. ఈ దాడుల్లో పాకిస్థాన్ విమానాలు కూడా దెబ్బతిన్నాయని ఆయన చెప్పారు. అయితే, పాకిస్థాన్‌కు చెందిన ఒక జెట్‌ను భారత్ కూల్చివేసినట్లు స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ, తమ జెట్ స్వల్పంగా మాత్రమే దెబ్బతిన్నట్లు ఇషాక్ దార్ పేర్కొన్నారు. భారత పైలట్లు ఎవరూ తమ అదుపులో లేరని కూడా ఆయన స్పష్టం చేశారు. గతంలో, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ విజయం సాధించిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. అంతేకాకుండా, పాకిస్థాన్ వ్యాప్తంగా పలువురు ప్రముఖులు, మాజీ క్రికెటర్ అఫ్రిది వంటి వారు పాల్గొన్న విజయోత్సవ ర్యాలీలు కూడా నిర్వహించారు. పాక్‌కు జరిగిన నష్టాన్ని భారత్ ఉపగ్రహ చిత్రాలతో సహా స్పష్టంగా చూపిస్తున్నప్పటికీ, తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, పైగా భారత్‌కే తీవ్ర నష్టం కలిగిందని పాకిస్థాన్ ఒక దశలో ప్రచారం చేసింది.

## అన్నమయ్య రచనలు బయటకు తీయాలంటే జీవితకాలం సరిపోదు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**




పద కవితా పితామహులు అన్నమయ్య రాసిన రచనలు బయటికి తీసేందుకు జీవితకాలం సరిపోదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయం హైదరాబాదు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పి కిషోర్ కుమార్ అన్నారు. శ్రీరామ సాంస్కృతిక సేవ సంస్థ శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్య 617జయంతి ఉత్సవాలు వ్యాఖ్యాన విశారద ప్రముఖ సాహితీవేత్త తాళ్లపాక పద సాహిత్య విశ్లేషకులు వెంకటగరికపాటి వ్యాఖ్యానంతో లిటిల్ మ్యూజిషియన్ అధినేత గాయకులు స్వరకర్త కోమండూరి రామాచారి గానంతో 108 మంది గాయనీ గాయకులతో రవీంద్ర భారతి వేదికగా జరిగిన కార్యక్రమం “నభూతో నభవిష్యతి” అనే విధంగా సాగింది. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ వృత్తి ప్రవృత్తిని సమన్వయం చేస్తూ అన్నమయ్య పద కవితలు తాత్పర్య సారంగా ప్రజానీకానికి అందజేయడం గరికపాటి అభినందనీయులని భక్తి రక్తి శృంగారం ఆయన కవితల్లో కనిపిస్తాయని అన్నారు. ప్రముఖ కవి రచయిత తెలంగాణ సారస్వత పరిషత్ ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు.మరో ముఖ్య అతిథి పద్మభూషణ్, శాంతా బయోటెక్నిక్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కే ఐ వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య సాహిత్యంలో భక్తి వైరాగ్యాలు పద కవితలు చెప్పడం అభినందనీయమని అన్నింటికి వివరంగా గరికపాటి వెంకట్ వివరణ ఇవ్వడం అత్యద్భుతం అని అన్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ మాట్లాడుతూ నిండు పున్నమి నాడు జన్మించిన అన్నమయ్య అందరికీ ఆదర్శమని నేటి యువతకు ఫోర్ జి ఫైవ్ జి ఆదర్శం అయితే నాకు బాలాజీ ఆదర్శం అని అన్నారు. ఆంధ్రభూమి విశ్రాంత సంపాదకులు ఎంవిఆర్ శాస్త్రి మాట్లాడుతూ సంగీత సాహిత్యాలు అన్నమయ్య ఆలోచన అమృతాలు అన్నీ బాగున్నా ఉద్దండులైన గరికపాటి, కోమండూరి, మరిన్ని అన్నమయ్య రచనలు బయటికి తీయాలని ఆకాంక్షించారు. ప్రముఖ సంగీత దర్శకులు లిటిల్ మ్యూజిషియన్, వ్యవస్థాపకులు కోమండూరి రామాచారి మాట్లాడుతూ ఇంతమంది పెద్దల ముందు ఈ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని, సినిమా పాటలే కాకుండా అన్నమాచార్య పాటలు పాడేందుకు మా సైన్యం అంతా సిద్ధంగా ఉందని శ్రీరామ సాంస్కృతిక సేవ సంస్థ అధినేత గోర్తి చందు కోరితే అన్నమయ్య పాటలు భవిష్యత్తులో వేదికలపై పాడేందుకు తాము సిద్ధమని అన్నారు. కార్యక్రమం ఆసాంతం అద్భుతంగా జరిగింది.

**- అలరించిన అన్నమయ్య సంగీత విభావరి**

ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన అనంతరం రామాచారి బృందం శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ అనే కీర్తన అందుకుంటే అలరులు కురియగా ఆడెనదే అలకల కులుకుల అలవేలుమంగ, అద్భుతంగా ప్రజెంట్ చేశారు.

**- ఈ కార్యక్రమానికి హైలెట్ అన్నమయ్య నువ్వు అన్నింటా మిన్న వయ్యా**

గరికపాటి వెంకట్ కలంలో జాలువారిన అన్నమయ్య నువ్వు అన్నింటా మిన్న వయ్యా అనే పాటలు 108 మంది గాయనీ గాయకులు కోమండూరి రామాచారి నేతృత్వంలో పాడగా ప్రేక్షకులతో గోవిందా గోవిందా అనే పాటను పాడించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా ప్రముఖ గాయని సురేఖ మూర్తి అద్భుతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు, గరికపాటికి “అన్నమయ్య తత్వ ప్రచాన సుధాకర్ “ అనే బిరుదు అంకితం చేయగా ప్రశంసా పత్రాన్ని ప్రముఖ గాయకులు పవన్ ఉమాపతి ప్రజెంట్ చేశారు.

# సంపాదకీయం

## మంచీ-చెడూ నేర్పితేనే మంచి పౌరులయ్యేది!

**వేద న్యూస్, డెస్క్:**

భావిభారత భవితవ్యాన్ని ఘనంగా ఆవిష్కరించంలో నేటి బాలలకు, విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మేధావులు, విద్యావంతులు తగిన మార్గ నిర్దేశం చేయాలి. ఎక్కడో జరిగిన అవాంఛనీయ సంఘటనలకు భయపడి, తమ పిల్లలు కూడా అదే బాటపడతారనే భయంతో, పిల్లల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరించడం వలన భవిష్యత్తులో జరిగే అనర్థాలు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. అతి గారాబంతో పిల్లలను పెంచడం మంచిది కాదు. విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. ఈ మధ్యకాలంలో చాలామంది విద్యార్థులను చూస్తున్నాం. ఫోన్ కొనివ్వలేదని, ల్యాప టాప్ చూడనివ్వలేదని, బాగా చదువుకోమంటున్నారని, మార్కులు సరిగా రాలేదని, తల్లిదండ్రులు మందలించారని, ప్రిన్సపల్ తిట్టాడని, ఉపాధ్యాయుడు కొట్టాడని ఇలా వేర్వేరు కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి గురించి వింటూనే ఉన్నాం. అడిగినవన్నీ కొనిచ్చి, అతి గారాబం చేయడం వలన, పొగడ్తలకు అలవాటుపడి, ఎప్పుడో ఒకసారి తల్లిదండ్రులు తిట్టినందుకు తీవ్రంగా మనస్తాపం చెంది, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న నేటితరం బాలల, విద్యార్థుల మానసిక స్థితిని గురించి తల్లిదండ్రులు కూలంకషంగా అధ్యయనం చేయాలి. మంచి పని చేస్తే చిన్న ప్రశంస, చెడ్డ పని చేస్తే మందలించడం అవసరం. దాదాపు 5 సంవత్సరాల వయసు వచ్చే వరకు పిల్లలపై భారం మోపకూడదు. ఆటపాటలతో, మన వ్యవహారశైలితో వారికి ప్రేమాప్యాయతలను చవిచూపించాలి. చిన్నచిన్న కథలద్వారా, పాటలద్వారా వారికి లోకం గురించిన ప్రాథమిక అవగాహన కలిగించాలి. టివిలకు, మొబైల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి. పుస్తకాలలోని బొమ్మల ద్వారా జ్ఞానం వైపు దృష్టిని మళ్ళించాలి. స్పష్టమైన ఉచ్చారణ అలవాటు చేయాలి. నాట్యం, సంగీతం వైపు ఆసక్తి కలిగేలా చేయాలి.

కేవలం రెండు మూడు సంవత్సరాల వయసులోనే స్కేటింగ్, స్విమ్మింగ్ వంటి వాటి జోలికిపోవద్దు. 5 సంవత్సరాలు దాటిన తర్వాత పిల్లలకు వారి తప్పొప్పులను తెలియ చేసి, సన్మార్గంలో పెట్టడం అవసరం. అలాకాకుండా ఏం చేసినా పొగడుతూ, పెంచడం వలన పిల్లలు మనకు తెలియకుండానే ఒక కంఫర్ట్ అండ్ సెన్సిటివ్ జోన్‌లోకి వెళ్ళి పోతున్నారు. ఎండలోకి వెళ్ళనీయకుండా, వానకు తడవనీయకుండా, దుమ్ము ధూళి సోకనీయకుండా, ముట్టుకుంటే హాండ్ వ్యాష్ చేసుకునే విధంగా పెంచడం వలన పిల్లల్లో రోగనిరోధక శక్తితగ్గిపోతుంది. చేతులు కడుక్కోవాలి. కాని ఖరీదైన హ్యాండ్ వాష్‌తో కాదు. బలమైన ఆహారం పెట్టండి. చికెన్లు, మటన్లు, బిర్యానీలు తింటే బలమొస్తుందనే భ్రమను వీడండి. రోజూ ఒకే రకమైన తిండి పెట్టకండి. మెనూ మార్చండి. పిల్లలకు అన్ని రకాల పోషకాలు అందేటట్లు చూడండి. చిన్నప్పటి నుండే రుచిపచీ లేని ఆహారం పెట్టి పిల్లలను చప్పిడి కూటితో రుచికి దూరం చేయకండి. కెమికల్ ఫుడ్‌కు పిల్లలను దూరం ఉంచాలి. తల్లిదండ్రులకు, బంధువులకు, పెద్దలకు పిల్లలను దగ్గర చేయాలి. అప్పుడప్పుడూ గ్రామీణ వాతావరణాన్ని పిల్లలకు పరిచయం చేయడం. ప్రకృతి అందాలను పిల్లలను ఆస్వాదించనీయండి. పిల్లలకు చిన్నప్పటినుండే మంచి మంచి ప్రదేశాలను చూపించండి. మంచి వాతావరణంలో పెరిగేటట్లు చేయండి. తల్లిదండ్రులు పద్ధతిగా ఉంటే పిల్లలు కూడా పద్ధతిగా పెరుగుతారు. కుటుంబ వాతావరణం సరిగా లేకపోతే పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. ఆటపాటలతో, చదువు సంధ్యలతో, అందరితో కలివిడిగా ఉండేటట్టు పిల్లలను పెంచండి. మంచి చదువు, సంస్కారం, ఇతరులకు పెట్టే గుణం, మంచిని పంచే గుణం పిల్లలకు నేర్పండి. కుళ్ళు, కుతంత్రాలు, స్వార్థపూరిత మైన మనస్తత్వాలను విడనాడి, పిల్లలను సద్గుణాలతో పెంచండి. ఏ విత్తనం నాటితే అదే మొక్క మొలుస్తుంది. పిల్లల పెంపకం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలోసాగాలి. పెద్దలను గౌరవించకపోవడం, తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం, మేలుచేసిన వారికి కీడును తలపెట్టడం, కృతజ్ఞత మరచి ప్రవర్తించడం, స్వార్థం పతాక స్థాయికి చేరడం నేటి సమాజంలో చూస్తున్నాం. పెట్టి తినే సంస్కృతి పోయి, దోచుకుని తినే సంస్కృతి ప్రబలింది. ఇలాంటి లక్షణాలు గల వాతావరణంలో పిల్లలు పెరిగితే వారు భవిష్యత్తులో ఎలా తయారవుతారో వేరే చెప్పనక్కరలేదు. ఆకాశంలో విహరిస్తూ, నేలను తూలనాడడంలో ఔచిత్యం లేదు. నింగినంటే భవనాలకు కూడా నేలే ఆధారమన్న సత్యం విడవరాదు.

మట్టిలో కలిసే శరీరాలకు మేలిమి రంగులు పూసి, మట్టి వాసనను అసహ్యించుకోవడం అత్యంత అసహ్యకరం. నేలవిడిచి సాము చేయడం మూర?త్వం. వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించి, మహా వృక్షమైనా దాని వేళ్ళు మట్టిలోనే ఉంటాయన్న నిజం మరిస్తే ప్రమాదం. ఎవరు, ఎంత ఎత్తుకు ఎదిగినా, వారి చూపు భూమిపై కేంద్రీకరించక తప్పదు. ఆకాశం వైపు చూస్తూ నడిస్తే, నేలపై బోర్లాపడక తప్పదు. అప్పుడు కూడా నేలే ఆధారం. దారం లేని గాలి పటం నేలపై పడకతప్పదు. దీనిని బట్టి మనకు విషయం అర్థం కావాలి. వెలుగు నిచ్చిన దీపాన్ని ఆర్పేసి, ఎక్కించిన నిచ్చెనను కూలదోసి, అవహేళన చేయడం మూర?త్వం. గాలికి వంగిన చిన్న మొక్కను అలాగే వదిలేస్తే ఆ మొక్క పెరిగి వంకర టింకర చెట్టుగా తయారవుతుంది. వంగిన మొక్కను నిటారుగా నిలబెట్టడానికి చిన్నకర్రతో మొక్కను కట్టినట్టు, సద్గుణాలతో, మంచి మాటలతో పిల్లలకు చిన్నతనం నుండి విలువలను నేర్పితే పెద్దయ్యాక రుజుమార్గంలో పయనించే అవకాశమేర్పడుతుంది.

పిల్లలకు నీతికథలను వినిపించండి. మన పెంపకాలు ఎంత పటిష్టంగా ఉన్నా పెరిగి పెద్దయ్యాక మారిపోయేవారు కూడా ఉంటారు. మన ప్రభావం కంటే దుష్టుల ప్రభావం వారిపై అధికంగా ఉండడం, లొంగిపోయే బలహీనమైన మనస్తత్వం కలిగి ఉండడం దీనికి కారణం. వ్యక్తిత్వం బలంగా ఉండాలి. బంధాలను భారంగా భావించకూడదు. మారిపోయే మనస్తత్వాల వలన వ్యక్తిత్వం దెబ్బతింటుంది. చిన్నప్పటి నుండి మంచిగా పెరిగినా, పెరిగి పెద్దయ్యాక దుర్జనుల సాంగత్యంలో దుర్బోధలకు బానిసలై సద్గుణాలు కోల్పోవడం ఆరోగ్యానిచ్చే ఔషధాన్ని వదిలేసి, మత్తును కలిగించే మాదకద్రవ్యాల వెంటపడడం లాంటిది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా బాల్యంలోనే సద్గుణాలకు, వివేకానికి బలమైన పునాదులు పడాలి. నేల మీద నిలబడడమే కాదు, మాట మీద నిలబడడం కూడా నేర్పాలి.

# నర్సింగ్ సేవల్లో అసమానతలు డబ్ల్యుహెచ్ఓ నివేదిక వెల్లడి


**వేద న్యూస్, డెస్క్:**

తక్కువ, మధ్య తరగతి ఆదాయాలు కలిగిన దేశాలు నర్సులను గ్రాడ్యుయేట్ చేయడం, తమ ఆరోగ్య వ్యవస్థల్లో వారిని నియమించడం, నిలుపుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) తన తాజా నివేదికలో పేర్కొంది. మానసిక ఆరోగ్యం, కార్మిక సంక్షేమం అనేవి ఆందోళనకరంగా వున్నాయని పేర్కొంది. అలాగే అంతర్జాతీయంగా నర్సింగ్ నియామకాల్లో నెలకొన్న అసమానతల వల్ల కీలకమైన ఆరోగ్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలు, దేశాల్లో నర్సుల సేవల లభ్యత విషయంలో అసమాతనలు అలాగే కొనసాగుతున్నాయని పేర్కొంది. ఇటువంటి పరిస్థితుల్లో నర్సుల ఉద్యోగాలను సృష్టించడానికి, కొనసాగించడానికి దేశీయంగా పెట్టుబడులను పెంచాల్సి వుందని 'స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ నర్సింగ్ 2025' నివేదికలో పేర్కొంది. అధిక ఆదాయం కలిగిన దేశాలతో పోలిస్తే తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో చాలా వేగంగా నర్సు గ్రాడ్యుయేట్లు పెరుగుతున్నారని నివేదిక పేర్కొంది. చాలా దేశాల్లో జనాభా వేగంగా పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వల్ల నర్సుల గ్రాడ్యుయేషన్ రేటులో కష్టపడి సాధించిన ప్రగతి మెరుగైన రీతిలో కనిపించడం లేదని నివేదిక పేర్కొంది. దీన్ని పరిష్కరించడానికి, దేశాలు ఉద్యోగాలను సృష్టించాలి, అప్పుడే గ్రాడ్యుయేట్లను ఆరోగ్య వ్యవస్థల్లోకి మిళితం చేయడానికి వీలు వుంటుందన్నారు. తద్వారా పని పరిస్థితులు కూడా మెరుగవుతాయన్నారు. ఇక అధిక ఆదాయ దేశాలు ఎక్కువ సంఖ్యలో రిటైరయ్యే నర్సుల పరిస్థితులను ఎదుర్కొనడానికి కూడా సిద్ధం కావాల్సి వుంటుంది. విదేశాల్లో



శిక్షణ పొందిన నర్సులపై ఆధారపడడాన్ని కూడా సమీక్షించుకోవాల్సి వుంటుందని నివేదిక పేర్కొంది. ఏ దేశాల నుండి నర్సులను నియమించుకుంటున్నామో ఆ దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలను బలోపేతం చేసుకోవాల్సి వుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడుగురు నర్సుల్లో ఒకరు, అధిక ఆదాయం కలిగిన దేశాల్లో 23శాతం మంది నర్సులు విదేశీ నర్సులే అయి వుంటున్నారని సర్వేలో వెల్లడైంది. అంటే అంతర్జాతీయ వలసలపై అధికంగా ఆధారపడుతున్నామని తేలింది. దీనికి విరుద్ధంగా ఎగువ మధ్య తరగతి ఆదాయ దేశాల్లో విదేశీ నర్సులు ఎనిమిది శాతం కాగా, తక్కువ మధ్య తరగతి ఆదాయ దేశాల్లో ఒక శాతంగా, తక్కువ ఆదాయ దేశాల్లో 3శాతంగా వున్నారని వెల్లడైంది.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం ఇద్దరు భారతీయ విద్యార్థులు మృతి



**వేద న్యూస్, డెస్క్:**




అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భారతీయ విద్యార్థులు మృతి చెందారు. మృతులను న్యూయార్క్‌లోని క్లీవ్‌ల్యాండ్ యూనివర్సిటీలో చదువుతున్న మానవ్ పటేల్ (20), సౌరవ్ ప్రభాకర్ (23) గా గుర్తించారు. ఈ ఘటనపై న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ ట్వీట్ ద్వారా సంతాపం వ్యక్తం చేసింది. పెన్సిల్వేనియాలో మే 10వ తేదీన మానవ్ పటేల్, సౌరవ్ ప్రభాకర్, మరో విద్యార్థి కలిసి కారులో బయటకు వెళ్లినప్పుడు ప్రమాదం జరిగింది. వీరి కారు వంతెనను ఢీకొట్టగా కారు నడుపుతున్న ప్రభాకర్, వెనుక సీటులో కూర్చున్న మానవ్ పటేల్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ముందు సీటులో కూర్చున్న మరో ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

# పార్లమెంట్ ప్రత్యేక సమావేశం వెంటనే నిర్వహించాలి

**వేద న్యూస్, డెస్క్:**



కాల్పుల విరమణకు, దేశ భద్రతకు సంబంధించిన అంశాలు, ఆందోళనలను పరిష్కరించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. ఈ మేరకు ఆయన ఒక లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం ఇలా వుంది. భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త తలు తగ్గించడానికి, కాల్పుల విరమణ ప్రకటించడా నికి సంబంధించి చోటు చేసుకున్న తాజా పరిణా మాల నేపథ్యంలో ఈ లేఖ రాస్తున్నాను. ఈ ప్రకటన మన దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అలాగే అంతర్జాతీయ శాంతి కాముకులకు ఉపశమనం కలిగించింది. అయితే, ఇంకా అనేక ఆందోళనలు-ముఖ్యంగా, పహల్గాంలో ఉగ్ర దాడికి సంబంధించినవి అపరిష్కృతంగానే వున్నాయి. ఏప్రిల్ 22న అమాయకులైన పర్యాటకులపై జరిగిన హేయమైన దాడి మన దేశ ప్రజల మనస్సులను కదిలించివేసింది. అయినా, దేశవ్యాప్తంగా ప్రజలందరూ ప్రదర్శించిన సమైక్యతా భావం అత్యంత శక్తివంతమైన, అమూల్యమైన శక్తిగా నిలిచింది. ఈ సంఘీభావాన్ని ఉపయోగించుకుని దేశీయ, విదేశీ ఉగ్రవాదులను, వారి మద్దతు దారులను ఏకాకులను చేయాలి. అయితే, ఈ జాతీయ ఐక్యతా భావనను విద్వేషం, దూకుడుతో కూడిన జాతీయవాదం (జింగోయిజం) వంటి ప్రచారాలు దెబ్బతీయడం విచారకరం. అలాగే కొన్ని మీడియా సంస్థలు, శక్తులు సామాజిక మాధ్యమాల వేదికలపై పాల్పడే తప్పుడు సమాచార వ్యాప్తి కూడా ఆందోళనకరం. ఇటువంటి చర్యలు ప్రజల్లో తీవ్రమైన గందరగోళాన్ని, అశాంతిని కలిగిస్తాయి. దీనికితోడు, భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు సంబంధించి ఆయా దేశాల ప్రతినిధుల నుండి ఎలాంటి అధికారిక ప్రకటన కూడా రాకముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తీవ్రమైన ఆందోళనలు రేకెత్తిస్తోంది. తృతీయ పక్షం జోక్యాన్ని అనుమతించకుండా మన వివాదాలను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలన్నది మన దేశం ఆమోదించిన స్పష్టమైన విధానంగా వుంది. అందువల్ల, ఈ పరిస్థితికి మన ప్రభుత్వంలో ఉన్నతస్థాయి వర్గాల నుండి స్పష్టమైన, అధికారయుతమైన వివరణ రావాల్సిన అవసరం వుంది.

# రిజర్వేషన్లపై కులగణన ప్రభావం

**వేద న్యూస్, డెస్క్:**

భారత దేశంలో బ్రిటిష్ పాలనా కాలం నుండే జనాభాను లెక్కించడం మొదలైంది. 1881లో మొదలైన జనగణన ప్రతి పదేళ్ళకోసారి లెక్కించడం జరుగుతున్నది. 1931 జనగణన వరకు కులాల వివరాల్ని కూడా సేకరించేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951లో జరిగిన జనగణన నుండి షెడ్యూల్డు కులాలు, తెగల వారిని మినహాయించి మిగిలిన కులాల వివరాల్ని నమోదు చేయడం లేదు. 2021 లో జరగాల్సిన జనగణన కరోనా మహమ్మారి వల్ల జరగలేదు. వివిధ రాష్ట్రాలో అసెంబ్లీ ఎన్నికలు, తదనంతరం లోక్‌సభ ఎన్నికలు జరగడంతో జనాభా లెక్కలు వాయిదా పడుతూ వచ్చాయి. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అనూహ్యంగా జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేయనున్నట్లు ప్రకటించింది. జనాభా లెక్కలు అనే అంశం భారత రాజ్యాంగంలోని కేంద్ర జాబితాలో పేర్కొనబడిన అంశం కాబట్టి కేంద్రమే సమగ్రంగా జనగణన చేస్తామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. భారత దేశమంటే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. వివిధ మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు ఎన్ని ఉన్నా మనమంతా భారతీయులమనే భావన ఇక్కడి ప్రజల్లో బలంగా ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగే ఎనిమిదో జనగణన ఇది. దీంట్లో కులాలవారీగా వివరాల్ని సేకరించడం ద్వారా దేశంలో ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్ర ప్రాంత పాలిత ప్రాంతాల్లో ఆయా సామాజిక వర్గాల్లోని కులాల జనాభాతోపాటు వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో వారి వాటా కూడా తెలిసే అవకాశం ఉంటుంది. దేశంలో జనాభాను ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాలుగా వర్గీకరించారు.

అయితే ఒక్కో కులం, ఒక్కో రాష్ట్రంలో, ఒక్కో వర్గంలో ఉంటుంది. వివిధ రాష్ట్రాల్లో ఆయా కులాల సామాజిక, ఆర్థిక వెనకబాటు ఆధారంగా ఈ విధంగా వర్గీకరించబడ్డాయని చెప్పవచ్చు. ఒక రాష్ట్రంలో ఒక సామాజిక వర్గం ఒసి జాబితాలో ఉంటే మరో రాష్ట్రంలో బిసి జాబితాలో చేర్చబడింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 1976 వరకు బిసి జాబితాలో ఉన్న కొన్ని కులాల్ని ఎస్‌టి జాబితాలోకి చేర్చడం జరిగింది. ఇప్పటికీ చాలా కులాలు తమను బిసి, ఎస్‌సి, ఎస్‌టిల జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కలతోపాటు కులాల వారీగా వివరాల్ని సమగ్రంగా సేకరించడం వల్ల దేశవ్యాప్తంగా ఏయే కులాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటుకు గురయ్యాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగే వీలుంటుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కులగణన జరపాలని పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్ పరిమితిని తొలగిస్తామని కూడా చెప్తోంది. దేశవ్యాప్తంగా పౌరులందరికీ విద్య, ఉద్యోగావకాశాలతోపాటు, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కల్పించడం రిజర్వేషన్ ముఖ్య ఉద్దేశంగా చెప్పవచ్చు. 2011 జనగణన ప్రకారం దేశంలో ఎస్‌సి సామాజిక వర్గజనాభా 16.6% అయితే వారికి 15% రిజర్వేషన్, ఎస్‌టి జనాభా 8.6% అయితే వారికి 7.5% రిజర్వేషన్ అమలవుతుంది. ఒబిసి జాబితాలో ఉన్న వారికి 27% రిజర్వేషన్ అమలు అవుతుంది. అయితే ఒబిసి జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. పేదరికానికి కులం, వర్గంతో సంబంధం లేదని 2019 లో కేంద్ర ప్రభుత్వం ఒసిల్లోని పేదల కోసం ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల రిజర్వేషన్ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా 103 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇడబ్లుఎస్ చట్టం తీసుకువచ్చి 15(6), 16(6) ఆర్టికల్స్ ప్రకారం 10% రిజర్వేషన్‌ను కల్పించింది. దీంతో దేశంలోని ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల్లో అర్హులైన ప్రతి వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ ఫలాలు దక్కేందుకు అవకాశం ఏర్పడింది. రిజర్వేషన్ అనే అంశం సమాజంలోని సామాజిక న్యాయం, సమానత్వం, చట్టపరమైన పరిమితుల మీద ఆధార పడి ఉంటుంది. ఈ అంశం పై భారత సుప్రీంకోర్టు 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 50% పరిమితిని నిర్దేశించింది. తెలంగాణలో కాంగ్రెస్ 2023 ఎన్నికల్లో బిసిలకు కామారెడ్డి డిక్లరేషన్‌లో 42% రిజర్వేషన్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా కులగణన నిర్వహించి రాష్ట్ర జనాభా 3.70 కోట్లని తెలిపింది. దేశంలో రిజర్వేషన్ పెంపు అంశం తెర మీదకు వచ్చినపుడు అందరికీ తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్ విధానం గుర్తుకు వస్తుంది. కానీ అక్కడ ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్‌లో చేర్చడం వల్ల న్యాయ సమీక్షకు అతీతంగా మారింది. 2007లో వచ్చిన ఐ.ఆర్ కోయల్హో కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెబుతూ 9 వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉండరాదని, అవి న్యాయ సమీక్షకు అతీతం కావని పేర్కొంది. రిజర్వేషన్ పెంపు అంశం కేంద్ర పార్లమెంటు అధికార పరిధిలో రాజ్యాంగ సవరణతో ముడిపడి ఉంటుంది. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రభావం రిజర్వేషన్ల పై ఏ విధంగా ఉండబోతుందో అన్నదానికి కాలమే సమాధానం చెప్తుంది.

వేద న్యూస్

బుధవారం మే 14, 2025



## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**వేద న్యూస్, కోదాడ :**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కోదాడ (యన్ఎమ్ఆర్) మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రమాదేవికి సి.ఐ.టి.యు జిల్లా కోశాధికారి,యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కోటగిరి వెంకట్ నారాయణ మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ టి.యు కోదాడ పట్టణ కార్యదర్శి ఎం ముత్యాలు, ప్రస్తుత యూనియన్ అధ్యక్షులు కొమ్ము నాగేశ్వరరావు,నాగమణి, ధనమ్మ, వెంకటేశ్వర్లు, బెనర్జీ, గోపి, రామారావు, లక్ష్మణ్, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, లింగమ్మ,బాబురావు,సురేష్, సైదులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

**వేద న్యూస్, కోదాడ/చిలుకూరు :**



సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామ పరిధిలో విద్యుత్ తీగెలు తెగి పడి మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారుగా రెండులక్షల రూపాయలు ఉంటుందని గన్నా వెంకటేశ్వర్లు, గన్నా సత్యనారాయణ, సుగుణమ్మ,గోపి,దేశి ముత్తయ్యలు తెలిపారు. ఈ గేదెలే తమకు జీవనాధారమని ఆ గేదెల పాల ఉత్పత్తి నుండి కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నామని అన్నారు. ఇప్పుడు తాము రోడ్డు మీద పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి ఇందిరమ్మ కాలనీ శాఖ సమావేశం చింతమల రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పేద ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పట్ల అనునిత్యం పనిచేస్తూ చేస్తుందని వారన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లను పార్టీలకతీతంగా ఏమి లేని నిరుపేదలకు ఎంపిక చేసి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి ఎద్దటి రాకుండా చూడవలసిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు.గతంలో లాగా ఊరు బయటలో పశువుల కోసం తొట్లు కట్టించి పశువుల దాహం తీరే విధంగా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ మండల సమితి సభ్యులు గోగుల యాదగిరి,లింగంపల్లి సైదమ్మ, వెంకటయ్య,మచ్చ శైలజ,చింతమల సుశీల,సలికంటి సైదమ్మ,మల్లమ్మ,మంద లింగయ్య,ఎం.సైదులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది.కార్యదర్శిగా లింగంపల్లి సైదమ్మ,సహాయ కార్యదర్శిగా చింతమల్ల సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**వేద న్యూస్, నల్లబెల్లి :**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని నల్లబెల్లి మండలంలోని కొండైలు పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడుత రాజేందర్, ఉపాధ్యాయులు పోరిక రవికుమార్ అన్నారు. మంగళవారం గ్రామంలో వారు బడిబాట సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అందిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కొండైలుపల్లి గ్రామ పరిధిలోని 5 నుంచి 14 సంవత్సరాల విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల యొక్క ఆవశ్యకతను తెలియజేసి, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, 2 జతల యూనిఫామ్స్, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, వారానికి 3 కోడిగుడ్లు, రాగి జావ, అర్హత, అనుభవం, అంకితభావం గల ఉపాధ్యాయులచే విద్యాబోధన, విశాలమైన తరగతి గదులు గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి వారి బంగారు భవితకు పునాదులు వేయాల్సిందిగా వారు తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల యొక్క సౌకర్యాలను వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు.

## అర్హులైన వికలాంగులందరికీ
# అంత్యోదయ కార్డులు ఇవ్వాలి

**వేద న్యూస్ కోదాడ :**




రాష్ట్రంలో అర్హులైన వికలాంగులాంగులందరికీ అంత్యోదయ కార్డులు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ముందుకు రావాలని వికారాబాద్ జిల్లా దోమ మండలం తాసిల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా దోమ మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట సంఘం మండల అధ్యక్షులు చుక్కయ్య అధ్యక్షతన నిర్వహించిన తాసిల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల సమాజం అనేక సమస్యలతో అల్లాడిపోతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగుల సమస్యల పరిష్కరించకుండా వికలాంగుల ఉద్యమాలను అణచివేసే కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. ముఖ్యంగా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం సమాజంలో అట్టడుగున ఉండి దుర్భర జీవితాలు గడుపుతున్న వికలాంగులకు అంత్యోదయ కార్డులు ఇచ్చేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. వికలాంగుల సమాజానికి సమాధానం చెప్పాలని రాష్ట్రంలో ఆసరా పింఛను వచ్చే ప్రతి వికలాంగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంత్యోదయ కార్డులు మంజూరు చేయడంతోపాటు తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ మున్సిపల్ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించిన మాదిరిగానే తెలంగాణ పంచాయతీ మున్సిపల్ ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన హామీ మేరకు వెంటనే వికలాంగుల పెన్షన్ రూ.6000 కు పెంచడంతోపాటు ఆర్టీసీలో 100శాతం రాయితీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ ఆధ్వర్యంలో సంఘం దోమ మండల అధ్యక్షులు చుక్కయ్య అధ్యక్షత నిర్వహించినట్లు ఈ తాసిల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెద్ద చెరువు వద్ద ఉన్న స్మశాన వాటిక, లెనిన్ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న స్మశాన వాటిక, జిల్లెల్ల గూడా స్మశాన వాటికలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఈ స్మశానవాటికలు ప్రజలకు అందుబాటులో లేవని ప్రజలు వేరే ప్రాంతాలలో ఉన్న స్మశాన వాటికలకు పార్థివ దేహాలను తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని మీర్ పేట భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, పసునూరి బిక్షపతి చారి, తులసి ముఖేష్ ముదిరాజ్, ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని స్మశాన వాటికలలో స్నానాల గదులు లైటింగ్ సిస్టం అందుబాటులో లేవని, పిచ్చి మొక్కలు లేకుండా అక్కడ మొత్తం శుభ్రంగా ఉంచాలని మీర్పేట మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేని సందర్భంగా, ఆర్వో చంద్రశేఖర్‌కి వినతి పత్రం ఇచ్చారు. అదేవిధంగా మీర్ పేట కార్పొరేషన్ లో రోహింగాలు ఎక్కువగా కనిపిస్తున్న సందర్భంగా దేశభద్రతలో భాగంగా వారి ఆధార్ కార్డు చెక్ చేయాలని వారిని వెంటనే ఇక్కడి నుంచి పంపాలని మీర్ పేట పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కీసర నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మీర్పేట భారతీయ జనతా పార్టీమాజీ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, మీర్ పేట బిజెపి మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శి గాజుల మధు, మాజీ కార్పొరేటర్ ఏ భీమరాజు, రాష్ట్ర నాయకులు సూల ప్రభాకర్, గోపీనాథ్, తుమ్మల రమేష్, సిద్దాల శ్రీనివాస్, మల్లికార్జున్, రాఘవేందర్,హైందవి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం..

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



భారతదేశ వ్యాప్తంగా మే20తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ కి జగిత్యాల జిల్లా మున్సిపల్ సంఘం(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్ సమ్మె నోటీస్ ఇచ్చిన అనంతరం వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు 102 సంవత్సరాల నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్మికుల హక్కులను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్లు తెచ్చి కార్మికుల హక్కులను కాల రాస్తున్నది కేంద్ర ప్రభుత్వం, కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలతో 47 కోట్ల మందికి నష్టం కలుగుతున్న సందర్భంలో భారతదేశంలో ఇప్పటికే 27 సార్లు సమ్మెలు చేసి 4 కోడ్ లను అమలు కాకుండా ఆపడం జరిగిందన్నారు. బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో మళ్లీ 4 కోడ్ లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అందులో భాగంగా దేశవ్యాప్తంగా మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చెయ్యాలన్నారు. కార్మికులందరూ మే 20 రోజు జరిగే ఒక రోజు దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనేందుకు సహకరించాలని కమిషనర్ ని కోరడం జరిగింది. శాంతియుతంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా సమ్మె చేస్తామని ముందస్తు సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి

**వేద న్యూస్, మహబూబాబాద్ :**



మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం పోచంపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వడదెబ్బకు గురైన గిరిజన రైతు గుగులోతు కిషన్ అకాల మరణానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు డిమాండ్ చేసారు. విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు, సౌకర్యాలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి కనీస మౌళిక సదుపాయాలను ఏర్పాట్లు చేయడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్ళలో తీవ్ర జాప్యం జరుగుతున్న దనడానికి వడ దెబ్బకు గురైన కిషన్ మరణమే నిదర్శనమని చెప్పారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి మండే ఎండల్లో పడిగాపులు కాయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసారు. కిషన్ అకాల మరణానికి స్పందించి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే కొనుగోలు కేంద్రాల్లో పేరుకు పోయిన ధాన్యం నిల్వలను కొనుగోలు చేయాలని, కిషన్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేసారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, గీసుకొండ :**



సోమవారం రోజున గీసుకొండ గ్రామంలో మేకల నర్సమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మరణించారు. ఆమె అంత్యక్రియల ఖర్చుల సహాయార్థం అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ మానవత్వంతో స్పందించి రూ5000/-ల ఆర్థిక సహాయాన్ని పంపగా అట్టి నగదును ప్రభుత్వ ఉపాధ్యాయులు కర్ణకంటి రాంమూర్తి మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో వీరితోపాటు గీసుకొండ సోషల్ సర్వీస్ టీం సభ్యులు మహ్మద్ సోనీ, యాదగిరి కుమారస్వామి, కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పండ్లతోటల పెంపకం కొరకు
## దరఖాస్తుల స్వీకరణ

**వేద న్యూస్, కమలాపూర్ :**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సన్న చిన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకం కింద మామిడి, సీతాఫలము, సపోటా, ఆయిల్ ఫామ్, అల్లనేరేడు, ఆపిల్ బేర్, దానిమ్మ, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్ వంటి తోటల పెంపకంతో పాటుగా గట్లపై అల్లనేరేడు, కొబ్బరి, సీతాఫలం, జామ వంటి పండ్ల మొక్కలు పెంచుకోవచ్చని అందుకోసం సంబంధిత పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో గాని మండల పరిషత్ కార్యాలయంలో గాని దరఖాస్తు చేసుకోవాలని కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న చిన్న సన్నకారు రైతులకు ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించడం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొక్కల ఖర్చు చెల్లించడం, అంతర పంటల నిర్వహణ ఖర్చులు, ఎరువుల ఖర్చులు, ప్రతినెల నీటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆసక్తి కలిగిన రైతులు 20 వ తేదీలోపు గ్రామపంచాయతీ కార్యాలయంలో గాని, మండల పరిషత్ కార్యాలయంలో గాని చిన్న, సన్న కారు ధ్రువీకరణ పత్రము, పట్టా పాస్ బుక్, ఉపాధి హామీ కార్డు, గ్రామపంచాయతీ తీర్మానం, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డ్ జత చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని రైతులను ఈ సందర్భంగా ఎంపీడీవో కోరారు.

## సీజేఐగా పదవీ విరమణ చేసిన
## జస్టిస్ సంజీవ్ ఖన్నా

**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడుతూ రిటైర్మెంట్ అనంతరం ఎలాంటి పదవులూ చేపట్టనని అన్నారు. కానీ, న్యాయ వృత్తిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. 2019 జనవరి 18న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియామకమైన ఆయన, 2024 నవంబర్ 11న చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. సుమారు ఆరు నెలల పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించి మంగళవారం పదవీ విరమణ చేశారు. మరోవైపు తదుపరి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. బుధవారం ఆయన 52వ సీజేఐగా ప్రమాణం చేయనున్నారు.

## చిల్లర ప్రచారాన్ని
## బంద్ చేయాలి

**మొదటి పేజీ తరువాయి**

స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతానని జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని ఆయన సూచించారు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ నాయకత్వ భాధ్యలు అప్పగిస్తే స్వాగతిస్తానని, క్రమశిక్షణ గల కార్యకర్తగా కేసీఆర్ ఆదేశాలను తూచా తప్పక పాటిస్తానని క్లారిటీ ఇచ్చారు. ఈ నేపధ్యంలోనే రేవంత్ సర్కార్‌పై హరీష్ రావు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం అమ్మకోవటానికి రైతులు కల్లాల్లో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ధాన్యం రాశులను వదిలేసి.. రేవంత్ అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శలు గుప్పించారు. అందాల పోటీల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా ఉంటున్నారని.. పాకిస్తాన్‌ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్‌ని నమ్మి అప్పు ఇవ్వడం లేదని సెటైర్లు వేశారు. రుణమాఫీ, రైతు బంధుపై సీఎం రివ్యూ చేయటం లేదని ప్రశ్నించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073